ఆటో.. అటో.. ఎటో..!

రోజురోజుకు విస్తరిస్తున్న నెల్లూరు నగరాన్ని ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. నగరంలోని ప్రధాన సెంటర్లలో ఆటోవాలాలు, కొందరు వాహనదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాంగ్ రూట్లలో వెళ్లడం, నో పార్కింగ్ వద్ద వాహనాలను నిలపడం ట్రాఫిక్‌కు కారణంగా మారుతోంది. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


ఆత్మకూరు బస్టాండ్ వద్ద ట్రాఫిక్ రద్దీ



ముత్తుకూరు సెంటర్ వద్ద నో పార్కింగ్ బోర్డు ఉన్నా నిలిచిన ఆటోలు




నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాంగ్ రూట్లో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనాలు

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక, గ్రావెల్ తవ్వకాలు చేసి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ పరిధిలోని గ్రామాల్లో ఎక్కడా గ్రావెల్, ఇసుక తవ్వకాలు ఉండకూడదన్నారు. దీనిపై ఇప్పటికే పోలీసు, మైనింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు.

బలవంతంగా రాజీనామా చేయించారని ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్) : వైఎస్సార్‌సీపీ నేతలు తమతో బలవంతంగా రాజీనామాలు చేయించారని 37వ డివిజన్‌కు చెందిన పలువురు మాజీ వలంటీర్లు మంగళవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కుంకాళమ్మతల్లికి గ్రామోత్సవం



ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామంలో కొలువైన కుంకాళమ్మ తల్లికి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. మేళతాళాల నడుమ ఊరేగుతున్న అమ్మవారికి గ్రామస్తులు కొబ్బరికాయ, కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

వ్యవసాయ సామగ్రి పంపిణీ

పొదలకూరు : కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన వ్యవసాయ సామగ్రిని మండలంలోని ప్రభగిరిపట్నం ఎస్సీ, ఎస్టీ రైతులకు మంగళవారం అందజేశారు. రూ.10 వేల విలువైన నీటి డ్రమ్ములు, టార్పాలిన్ పట్టాల సామగ్రిని అందించారు. గ్రామానికి చెందిన 30 కుటుంబాలకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రవీంద్రబాబు, పెంచలయ్య, నర్సయ్య, సులోచన, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయ స్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు. మహిళా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముదివర్తిలో బడిబాట

విడవలూరు : మండలంలోని ముదివర్తి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.రమణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మూడేళ్లు నిండిన పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాల్సిందిగా కోరారు. ఇక్కడ పిల్లలకు చదువుతో పాటు ఆట పాటలు, పోషకాహారం అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శీనమ్మ, తిరుపతమ్మ, హేమలత, లావణ్య, శారద, సులోచనమ్మ, మహిళా పోలీస్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చెత్తపై చిత్తశుద్ధి ఏదీ?

స్వచ్ఛ సింహపురి లక్ష్యం నీరుగారుతోంది. నగరంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం పూర్తిస్థాయిలో కనిపించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులకు గురికావడమే. దీంతో రోడ్లపై చెత్త గుట్టలు గుట్టలుగా నిల్వ చేరి క్రిమికీటకాలు వాలడమే కాకుండా దుర్గంధం వెదజల్లుతోంది. ఎక్కడ అంటురోగాలు ప్రబలుతాయోనని నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- రెండు, మూడు రోజులకు చెత్త సేకరణ
- ఫలితంగా రోడ్లపై పేరుకుపోతున్న చెత్త
- అంటురోగాలు ప్రబలే అవకాశం

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో 54 డివిజన్లు ఉండగా 167 సచివాలయాలున్నాయి. 150 కిలోమీటర్ల మేర విస్తీర్ణం ఉన్న నగరంలో 1,83,643 గృహాలు ఉన్నాయి. నగరంలో చెత్త సేకరణకు 146 వాహనాలున్నాయి. ఇందులో మినీ వ్యాన్లు 129, ట్రాక్టర్లు 8, రెండు స్వీపింగ్ మెషీన్లతో పాటు మరో ఏడు వాహనాలు అదనంగా ఉన్నాయి. వీధులు, కాలువలు శుభ్రం చేసేందుకు 1,506 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. వీరితో పాటు ఆరుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు హెల్త్ అసిస్టెంట్లు, 131 మంది వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, 26 మంది పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు ఉన్నారు. ఆయా వాహనాలతో నిత్యం ఇంటింటి నుంచి పొడి, తడి చెత్తను సేకరిస్తూ డంపింగ్ యార్డుకు తరలిస్తారు.


నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మరమ్మతులకు గురైన క్లాప్ మినీ వాహనాలు

ఇలా రోజూ దాదాపు 300 టన్నుల చెత్త సేకరణ జరుగుతుంది. మరోవైపు రోడ్లు ఊడుస్తూ కాలువలను శుభ్రం చేస్తారు. దీంతో నగరం పరిశుభ్రంగా ఉంటుంది. అయితే నేడు ఆ పరిస్థితి కన్పించడం లేదు.

రెండుమూడు రోజులకోసారి..

నగరంలో ప్రతిరోజు ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరగాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 21 క్లాప్ మినీ చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులకు గురికావడంతో ప్రస్తుతం రెండు మూడు రోజులకోసారి చెత్త సేకరణ జరుగుతోంది. దీంతో ఇళ్లలో నిల్వ చేరిన చెత్తను రోడ్లపై పారవేస్తున్నారు. ఈ చెత్త గాలికి ఎగిరి చెల్లా చెదురవడంతో పాటు రోడ్లపై రాకపోకలు సాగించే వారిపై పడుతోంది. మరోవైపు ఆవులు చెత్తలో ఉన్న ఆహారంతో పాటు ప్లాస్టిక్ కవర్లను కూడా తింటున్నాయి. నిల్వ ఉన్న చెత్తలో క్రిమీకీటకాలు చేరడం వల్ల అంటు రోగాలు ప్రబలే అవకాశాలు ఉండడంతో నగర ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


సత్యనారాయణపురం ప్రధాన రోడ్డుపై పడేసిన చెత్తలోని ఆహారాన్ని తింటున్న ఆవులు

ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్ల ఏర్పాటు

మరమ్మతులకు గురైన క్లాప్ మినీ చెత్త వాహనాల స్థానంలో అధికారులు ప్రత్యామ్నాయంగా ప్రైవేటు ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. అయితే ఆయా ట్రాక్టర్లు నగరంలోని రంగనాయకులపేట, ఫత్తేఖాన్‌పేట, మండపాలవీధి, చిన్నబజార్, జెండావీధి తదితర ప్రాంతాల్లో ఉన్న చిన్నచిన్న వీధుల్లోకి ప్రవేశించలేకపోతున్నాయి. ప్రధాన వీధుల్లో ఉండే గృహాల నుంచి మాత్రమే చెత్త సేకరణ జరుగుతోంది.

మూలనపడిన చెత్త సేకరణ వాహనాలు

ఇంటింటి నుంచి చెత్త సేకరించే మినీ వాహనాలు 129 ఉండగా ఇందులో 78 టాటా ఏస్ మినీ వాహనాలు కాగా రెడ్డి అండ్ రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ అనే ప్రైవేట్ సంస్థకు చెందిన 51 క్లాప్ మినీ వాహనాలు ఉన్నాయి. ఇందులో 21 క్లాప్ వాహనాలు మరమ్మతులకు గురై ఉన్నాయి. వీటిని నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోనే ఉంచారు. ఈ వాహనాలకు సంబంధించి నిర్వహణ ప్రైవేట్ సంస్థ చూసుకోవాల్సి ఉంది. అయితే రెండు నెలలకుపైగా మరమ్మతులకు గురైన క్లాప్ మినీ వాహనాల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

దీంతో చిన్న వీధులు, సందుల్లో ఉండే నివాసాల వారు చెత్తను రోడ్లపై పడేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు మరమ్మతులకు గురైన క్లాప్ మినీ వాహనాలను బాగు చేయించేలా చర్యలు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాలని నగర ప్రజలు కోరుతున్నారు.


మారుతీనగర్‌లో రోడ్డుపక్కన చెత్త గుట్టలు

వాహనాల నిర్వహణ ప్రైవేట్ సంస్థదే

మరమ్మతులకు గురైన 21 వాహనాల గురించి సంబంధిత సంస్థకు తెలియజేశాం. ప్రస్తుతం చెత్త తరలింపునకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా మరమ్మతులకు గురైన వాహనాల స్థానంలో 40 ట్రాక్టర్లను ఏర్పాటు చేశాం. చిన్న వీధుల్లో చెత్త తరలింపు కొంత ఇబ్బందిగా ఉంది. వాహనాలు అందుబాటులోకి వస్తే ఇబ్బందులు తొలగుతాయి.

– సంజయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, నగరపాలక సంస్థ

చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం



ఎప్పటికప్పుడు ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్నాం. మినీ వాహనాలు మరమ్మతులకు గురవడం వల్ల వాటి స్థానంలో ట్రాక్టర్లను ఏర్పాటు చేసి చెత్త సేకరణ చేస్తున్నాం. ట్రాక్టర్లు వెళ్లలేని వీధుల్లో పారిశుద్ధ కార్మికులు వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారు. రోడ్లపై పడేసిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ వెంకటరమణ, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

కఠినంగా శిక్షించాలి



నిరసన చేస్తున్న ఏఐవైఎఫ్ కార్యకర్తలు

నెల్లూరు(వేదాయపాళెం) : తెలంగాణలో ఆరేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి, హత్య చేసిన మృగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ బొమ్మ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హమాలీ కూలీల ఆరేళ్ల కుమార్తెను పక్క మిల్లులో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన 28 ఏళ్ల వినోద్‌మాజీ అనే వ్యక్తి అతిదారుణంగా అత్యాచారం చేసి, గొంతు నులిమి చంపడం సభ్య సమాజం తలదించుకునేలా చేసిందన్నారు. అలాంటి వ్యక్తిని ఉరితీయడంతో పాటు ఆ కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షాన్‌వాజ్, షబ్బీర్, వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ నాయకులు గౌస్, సర్దార్, బాషా, రియాజ్, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..


ఆనంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ మాగుంట

నెల్లూరు (దర్గామిట్ట) : రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంతపేటలోని మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

మంత్రికి వినతి

నెల్లూరు (దర్గామిట్ట) : సోమశిల డ్యామ్ రక్షణ పనులు చేయించాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, బీజేపీ నేత పేర్నాటి రంగారెడ్డి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఆనం నివాసంలో మంగళవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.

కేంద్ర బృందానికి సాదర స్వాగతం

నెల్లూరు(దర్గామిట్ట) : జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయడానికి మంగళవారం నెల్లూరుకు వచ్చిన కేంద్ర బృంద అధికారులకు నెల్లూరు ఆర్డీఓ మలోల పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో వారు బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో నగరంలోని ఓ హోటల్‌లో బస చేస్తున్న కేంద్ర బృంద అధికారులైన మన్ను ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యలకు నెల్లూరు ఆర్డీఓ మలోల పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు.


కేంద్ర అధికారులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్డీఓ మలోల

ఆత్మీయ సమావేశం

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని కనుపర్తిపాడులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్‌లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో అబ్దుల్ అజీజ్, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు

చలపతి, చెంచయ్యకు ఘన నివాళి

నెల్లూరు(వేదాయపాళెం) : దివంగత గోను చలపతి, మేకల చెంచయ్యల 26వ వర్ధంతి సందర్భంగా స్థానిక 20వ డివిజన్ నక్కలగుంట ప్రాంతంలో వారి స్థూపం వద్ద సీపీఎం, డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ రూరల్ ఇన్‌చార్జి, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిత్యం పేదల సమస్యలు తీర్చేందుకు గోను చలపతి, చెంచయ్య పోరాటాలు చేశారన్నారు. వారి ఎదుగుదలను చూసి ఓర్వలేని శక్తులు రౌడీమూకలతో హత్య చేయించారని విమర్శించారు. అమరుల త్యాగ స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కిన్నెరకుమార్, కొండా ప్రసాద్, పాటల శీనయ్య, సంపత్‌కుమార్, ఒంగోలు సుధీర్, సురేష్, రమణ, నరసింహ, గోను చైతన్య పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కార్మికులకు బీసీజీ వ్యాక్సినేషన్



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం గ్రీన్ హౌస్ రొయ్యల ఫ్యాక్టరీ కార్మికులకు కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం బీసీజీ వ్యాక్సిన్ వేశారు. 18 ఏళ్లు నిండిన సుమారు వంద మంది కార్మికులకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులు ఎక్కువగా ఉన్న ఫ్యాక్టరీల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వ్యాక్సినేషన్ చేయడం వల్ల ఎక్కువ మంది సద్వినియోగం చేసుకుంటారన్నారు. అందువల్లే ఫ్యాక్టరీలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. కార్మికులంతా 18 నుంచి 60 ఏళ్లలోపు వారే కావడంతో తగిన జాగ్రత్తలు తీసుకుని వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీబీ వచ్చి తగ్గిపోయిన వారు, మధుమేహ బాధితులు, పొగతాగే వారు, క్షయ రోగితో దగ్గర సంబంధం ఉన్నవారికి వ్యాక్సిన్ వేశామన్నారు. క్షయతో బాధపడుతున్న వారు, గర్భిణులు, పిల్లలకు పాలిచ్చే తల్లులు, హెచ్ఐవీ బాధితులు, కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాక్సిన్ వేయరాదన్నారు.